క్లుప్తంగా

22 నుంచి దసరా ఉత్సవాలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక తెలిపారు. దసరా మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ముగ్గురమ్మలను 11 రోజుల పాటు వివిధ అలంకరణలు చేయనున్నట్లు పేర్కొన్నారు. 22న శ్రీ బాల త్రిపుర సుందరీదేవి, 23న శ్రీ గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న శ్రీ కాత్యాయనీదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న లలిత త్రిపుర సుందరీదేవి, 28న మహాచండీ దేవి, 29న శ్రీ సరస్వతీదేవి, 30న శ్రీ దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసుర మర్దిని దేవి, 2న శ్రీ రాజ రాజేశ్వరీ దేవిగా అలంకరించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా అక్టోబరు 3న ఆలయంలో అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. అమ్మవారి అలంకరణల సందర్భంగా రోజూ సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు పశు వైద్యశాలలో సోమవారం జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ చింతల మల్లిబాబు నేతృత్వంలో 5 ఆవులకు, 30 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో నెల రోజుల పాటు పశువులకు ఉచితంగా ఈ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకాలు వేయించాలని పశుపోషకులకు సూచించారు. టీకాలు వేయించడం వల్ల పశువుల్లో పాల ఉత్పత్తులు తగ్గకుండా క్రమబద్ధీకరిండంతో పాటు దూడల్లో మరణాలు నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

విజయవాడ రూరల్: మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక వైద్య శిబిరాలను కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు విజయవాడ రూరల్ వైద్యాధికారి డాక్టర్ ఎస్.విజయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి చేయడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలన్నారు. మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేధింపులపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): తనను, తన ఇద్దరు కుమార్తెలను వేధింపులకు గురిచేస్తున్నట్లు ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నున్న గ్రామంలో తన ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటున్న ఫిర్యాది ఆగిరిపల్లికి చెందిన వ్యక్తితో గతంలో సహజీవనం చేసింది. ఇప్పుడు తనను, తన కుమార్తెలను వ్యక్తి వేధింపులకు గురిచేస్తున్నట్లు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పు చెల్లించాలని కొట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): అప్పు తీసుకున్న డబ్బులు వడ్డీతో ప్రతి నెలా చెల్లిస్తున్నా దాడి చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలు ఇలా.. నున్న గ్రామానికి చెందిన మాళావత్ నాగరాజు కోడిగుడ్ల వ్యాపారం నిమిత్తం కలకోటి కోటిరెడ్డి దగ్గర 2018వ సంవత్సరంలో రూ.30 వేలు అప్పుగా తీసుకొని ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తున్నాడు. అయినప్పటికీ రూ.60 వేలు కట్టవలసి ఉందని ఈ నెల 9న నున్న కోటకట్ట సెంటర్ వద్ద కలెక్షన్ చేసి వస్తున్న తనను కోటిరెడ్డి అడ్డగించి తన స్కూటీని తీసుకున్నాడని అన్నాడు. నాగరాజు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎటూ తేలని వక్ఫ్ భూముల ఏక్‌సాల్ లీజు

- టెండర్ జరిగి మూడు నెలలు
- గడిచిపోయిన ఖరీఫ్ సీజన్



తాడిగడపలో వక్ఫ్ భూములు

పెనమలూరు: అత్యంత విలువైన వక్ఫ్ భూముల ఏక్‌సాల్ లీజు వ్యవహారం ఎటూ తేలక పోవటంతో ముస్లింల సంక్షేమం ప్రశ్నార్థకంగా మారింది. వక్ఫ్ బోర్డు అధికారులు సక్రమంగా స్పందించక పోవటంతోనే సమస్య తీరలేదని ముస్లిం సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో కొండపల్లి ఖాజీకి చెందిన వక్ఫ్ భూములు దాదాపు 43 ఎకరాలు ఉంది. చాలా కాలంగా ఈ భూమి పెత్తందారుల చేతిలో ఉండటంతో వక్ఫ్ ఆదాయానికి భారీగా గండి పడింది. వక్ఫ్ భూములపై సాక్షిలో కథనాలు రావటంతో అధికారులు ఎట్టకేలకు స్పందించి వేలంపాటకు నిర్ణయించారు. దీని పై కొందరు వ్యక్తులుహైకోర్టులో రిట్‌పిటీషన్ 2323/2025,2324/2025 వేశారు. దీని పై విచారించిన కోర్టు కౌలు వేలంపాట నిర్వహించి కోర్టుకు వివరాలు సమర్పించాలని ఆదేశించింది.

జూన్‌లో వేలంపాట....

కాగా వక్ఫ్ భూముల వేలంపాటకు తొలుత తేదీ నిర్ణయించగా ఎమ్మెల్సీ కోడ్అడ్డు రావటంతో వేలంపాట వేయలేదు. ఎన్నికల తరువాత అధికారులు వేలంపాటకు జాప్యం చేశారు. ముస్లిం సంఘాలు నిరసనతో ఎట్టకేలకు పెనమలూరు తహసీల్దార్ జూన్ 11న బహిరంగ వేలంపాట నిర్వహించారు. 43.51 ఎకరాలకు గాను 41.53 ఎకరాలకు వేలంపాట నిర్వహించగా హోరాహోరీగా వేలంపాట జరిగింది. ఏక్‌సాల్ లీజుకు రూ 25 లక్షల వరకు నలుగురు కౌలుదారులు వేలంపాట పాడారు. మిగతా 2 ఎకరాలలో షాదీఖానా, ఈద్గా నిర్మాణానికి కొండపల్లి ఖాజీ ముస్లింల సంక్షేమానికి లీజు ఇచ్చారు. ఇంత వరకు వ్యవహారం బాగానే ఉన్నా ఆ తరువాత వక్ఫ్ భూముల వ్యవహారం ముందుకు సాగలేదు. ఖరీఫ్‌లో వరి సాగు చేయాల్సి ఉండగా కోర్టు నుంచి క్లియరెన్స్ రాలేదు. దీంతో ఖరీఫ్ సీజన్ గడిచిపోయింది. ప్రస్తుతానికి వక్ఫ్ భూముల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

అధికారులపై ఆరోపణలు....

వక్ఫ్ భూముల వ్యవహారం కోర్టులో ఉండగా అధికారులు సక్రమంగా స్పందించలేదని ముస్లిం సంఘాలు ఆరోపిస్తున్నాయి. కోర్టు విచారణలో ఉన్న భూములు కోర్టు ఆదేశాల మేరకు కౌలు వేలంపాట జరిపిన విషయం కోర్టు దృష్టికి అధికారులు సకాలంలో తీసుకు వెళ్లటంలో విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. దీని కారణంగా ఖరీఫ్‌సీజన్ ముగిసిందని తెలుపుతున్నారు. ఇప్పటికైనా వక్ఫ్ బోర్డు , రాష్ట్ర వక్ఫ్ అధికారులు కోర్టులో కేసు పరిష్కరించే దిశలో కృషి చేయాలని ముస్లిం సంఘాలు కోరుతున్నాయి. ముస్లింల సంక్షేమానికి అధికారులు కృషి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వక్ఫ్ భూములకు న్యాయం చేస్తాం

వక్ఫ్ భూములకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తాము. కోర్టు పరిధిలో కేసు ఉన్నందున వక్ఫ్ బోర్డు న్యాయవాదులతో కోర్టు దృష్టికి వేలంపాట జరిపిన విషయం తీసుకువెళతాము. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను.

– ఎండీ.అలీ, సీఈవో స్టేట్ వక్ఫ్ బోర్డు

ఇంజనీరింగ్ విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదల ముఖ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామారావు

నున్న(విజయవాడ రూరల్): ఇంజనీరింగ్ విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడంలో క్రమశిక్షణ, పట్టుదల ఎంతో ముఖ్యమని సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీరు కె.రామారావు అన్నారు. సోమవారం నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించారు. తొలుత భారత రత్న సర్ మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మరో అతిథి ఎస్.సురేష్ మాట్లాడుతూ.. భారతీయ ఇంజనీర్లు ప్రపంచానికి అందించిన ప్రాముఖ్యమైన ఆవిష్కరణలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఇన్నోవేషన్ క్విజ్, ఐడియా థాన్ ప్రాజెక్ట్ థాన్ పోస్టర్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.ఎస్.శ్రీనివాస్, సెక్రటరీ ఎన్.సత్యనారాయణ రెడ్డి, ప్రొఫెసర్ కిషోర్‌రెడ్డి, డిప్లొమో ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామంలోని వికాస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు సోమవారం ఇంజనీర్స్ డేను ఉత్సాహంగా జరుపుకొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ అండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్(రిటైర్డు) టీవీఎస్ఏ రత్నకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలను కొనియాడారు. తెలుగు రాష్ట్రాలకు ఆయన అందించిన పలు ప్రాజెక్టులను గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు ఇంజనీర్స్ డే ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి రెడ్డి మోక్ష గుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు బీఎల్ నాయక్, బి.వెంకటేశ్వరరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రత్నకుమార్

హనుమాన్‌జంక్షన్‌కు చేరిన ఆటో డ్రైవర్ పాదయాత్ర

ఉచిత బస్సు రద్దు చేయాలని విశాఖ నుంచి మొదలు



శ్రీను పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న స్థానిక ఆటో డ్రైవర్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): స్త్రీ శక్తి పథకంతో జీవనోపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ చింతకాయల శ్రీను చేపట్టిన పాదయాత్ర సోమవారం హనుమాన్‌జంక్షన్‌కు చేరింది. స్థానిక ప్రధాన కూడలి వద్ద ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాన రహదారుల్లో ఫ్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ ప్రదర్శన చేశారు. ఉచిత బస్సు పథకానికి వ్యతిరేకంగా ఈనెల రెండో తేదీన విశాఖపట్టణం నుంచి పాదయాత్ర చేపట్టానని.. అమరావతి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం అందజేయనున్నట్లు ఆటోడ్రైవర్ చింతకాయల శ్రీను తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు.

ఇంజనీర్లు దేశాభివృద్ధికి కృషి చేయాలి



ఉత్తమ విద్యార్థులతో పుల్లారావు

పెనమలూరు: ఇంజనీర్లు దేశాభివృద్ధికి కృషి చేయాలని ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ పి.పుల్లారావు అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా పోరంకి ఎల్ఎస్ గార్డెన్స్‌లో సోమవారం రిటైర్డ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యార్థులు చదవాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చాటిన పేద ఇంజనీరింగ్ విద్యార్థులు 13 మందికి ఉపకార వేతనాలుగా రూ.లక్ష అందజేశారు. తోటకూర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత తోటకూర రాఘవేంద్రరావు జ్ఞాపకార్థం బంగారు పతకాన్ని సంఘ సీనియర్ సభ్యుడు ఎం.కేశవరెడ్డికి బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జి.పట్టాభిరామారావు, సభ్యులు వై.కుమారస్వామి, అన్నేసాంబశివరావు, ఆంజనేయులు, డి.భానుప్రసాద్, డి.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

ధనేకుల కాలేజీలో..

గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీర్స్ డేను ఘనంగా జరిపారు. ఇంజనీరింగ్ చదువుతున్న ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ రోడ్డులోని లయన్స్ క్లబ్ హాల్‌లో జరిగిన ఈ వేడుకల్లో తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తి విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. అనంతరం విద్యుత్‌శాఖ డీఈఈ బి.శ్రీనివాసరావు, ఏఈ ఐ.రుక్మిణి కల్యాణి, జలవనరుల శాఖ ఏఈలు కుందేటి ప్రసన్నకుమార్, బి.ఉదయ్‌కిరణ్, కె.సూర్యతేజలను లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వీరమాచినేని రామబ్రహ్మం, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు నందూరు సత్య వెంకటేశ్వర శర్మ, నందిగం వెంకటేశ్వరరావు, చలసాని వెంకటేశ్వరరావు, మత్తి సాంబశివరావు పాల్గొన్నారు.



ఇంజనీర్లను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



కన్నయ్యనాయుడిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

పెనమలూరు: దేశ ప్రగతిలో అన్ని రంగాల్లో ఇంజనీర్ల పాత్ర చాలా కీలకమని నీటివనరుల జాతీయ నిపుణుడు, ఏపీ ప్రభుత్వ నీటి వనరుల సలహాదారుడు ఎస్.కన్నయ్యనాయుడు అన్నారు. కానూరు సిద్ధార్థ డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో సోమవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జరిగిన ఇంజనీర్స్ డేలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇంజనీర్లు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ.. సివిల్, మెకానికల్ ఇంజనీర్ల పాత్ర చాలా కీలకమన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు వికసిత భారత్ 2047కు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కన్నయ్యనాయుడును కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, ప్రో ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, డైరెక్టర్ ప్రొఫెసర్ బావినేని పాండురంగారావు, ప్రొఫెసర్ డి.వెంకటరావు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీపీలో..

కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఇంజనీర్స్ డేలో కన్నయ్యనాయుడు పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ జగదీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక ఊరేగింపు



కంకిపాడు: వినాయక ఊరేగింపు మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతికి భక్తులు నవరాత్రులు పూజలు జరిపారు. గోదావరి జిల్లాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సంప్రదాయ మేళతాళాలతో విఘ్నేశ్వరుడి ఊరేగింపు కోలాహలంగా సాగింది. లాకురోడ్డులో ఏర్పాటుచేసిన మందిరం వద్ద 5000 మంది భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో తుమ్మలపల్లి హరికృష్ణ, వణుకూరు విక్రమ్, పలువురు నాయిబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గీత కార్మికులపై సర్కారు నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రరావు

ఉయ్యూరు: కల్లుగీత కార్మికులను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్రరావు విమర్శించారు. ఉయ్యూరులో సోమవారం కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం శీతకన్ను చూపుతోందని విమర్శించారు. కల్లుగీత కార్మికులకు వృత్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో అమలు చేయాలని కోరారు. హైబ్రిడ్ తాటి, ఈత వనాలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, కోసూరి శివనాగేంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ష్యూరిటీ లేకుండా కౌలుదారులకు రుణాలు ఇవ్వాలి



ఉంగుటూరు(గన్నవరం): సీసీఆర్‌సీ కార్డు ఉన్న ప్రతి కౌలుదారులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఏ విధమైన ష్యూరిటీ లేకుండా బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఉంగుటూరులోని కెనరా బ్యాంక్ శాఖ వద్ద సోమవారం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెనరా బ్యాంక్ ఉంగుటూరు శాఖలో 400 మంది వరకూ కౌలుదారులు ఏటా రూ.25 వేలు నుంచి రూ.లక్ష వరకు రుణాలు తీసుకుని, తిరిగి చెల్లిస్తున్నారని అన్నారు. కొత్తగా వచ్చిన బ్రాంచ్ మేనేజర్ సీసీఆర్‌సీ కార్డుపై రూ.50 వేలు వరకు మాత్రమే ష్యూరిటీపై రుణాలు ఇస్తామని షరతులు పెట్టినట్లు వివరించారు. దీంతో కౌలుదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ నేతలు ఆజ్మీరా వెంకటేశ్వరరావు, సలీం, మాగంటి సాంబశివరావు, టీవీ రామ్మోహన్‌రావు, పిల్లి రాజారావు, రెడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాపిటల్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స



పెనమలూరు: కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకి గ్రామంలోని క్యాపిటల్ ఆసుపత్రిలో అరుదైన కార్డియో సర్జరీ చేశామని కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ కడియాల హేమకృష్ణసాయి తెలిపారు. క్యాపిటల్ ఆసుపత్రిలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. టంగుటూరుకు చెందిన 40 ఏళ్ల మదన్‌కు మల్టీ వాల్యులర్ హార్ట్ డిసీజ్, తీవ్రమైన లివర్ డిస్ ఫంక్షన్ ఉందన్నారు. సంక్లిష్టమైన ప్రక్రియలో స్టెర్నోటమీని పునరావృతం చేయడం.. బృహద్ధమని కవాటం జాగ్రత్తగా పాసస్ తొలగింపు, మిట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్, ట్రైకస్పిడ్ వాల్వ్ మరమ్మతులు శస్త్ర చికిత్స వైద్య బృందంతో విజయవంతంగా చేశామన్నారు. శస్త్ర చికిత్స తరువాత రోగి కోలుకుని సరిగ్గా శ్వాస తీసుకోవటంతో డిశ్చార్జ్ చేశామని వివరించారు. ఇంత తీవ్రమైన కాలేయ వైఫల్యం ఉన్న రోగికి క్లిష్టమైన కార్డియాక్‌సర్జరీ హైరిస్క్‌తో చేయడం పునర్జన్మ అన్నారు. ఈ చారిత్రాత్మక శస్త్ర చికిత్స ఏపీలో అధునాతన హైరిస్క్ కార్డియోసర్జరీ ప్రముఖ కేంద్రంగా క్యాపిటల్ ఆసుపత్రి ఖ్యాతి పొందిందని ఎండీ డాక్టర్ మన్నే హరీష్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వి.సురేష్‌కుమార్ తెలిపారు.

నైపుణ్య శిక్షణతో పేదరిక నిర్మూలన సాధ్యం



ఆత్కూరు(గన్నవరం): పేదరికాన్ని నిర్మూలించడానికి యువతకు స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ ఇవ్వాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ఆయన సోమవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య శిక్షణ ఉద్యమంలా మారాలన్నారు. పేద, దిగువ మధ్య తరగతి, గ్రామీణ ప్రాంతాల యువత తమ కాళ్లపై తాము నిలబడే విధంగా స్వర్ణభారత్ ట్రస్ట్ స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తద్వారా యువతను పేదరికం నుంచి గట్టెక్కించి, వారికి సంతోషకరమైన, ఆరోగ్యమైన జీవితాన్ని అందించడానికి అవసరమైన మద్దతు ఇస్తున్నామన్నారు. సమాజంలో సగభాగమైన మహిళలకు కూడా శిక్షణ ఇచ్చి స్వతంత్రంగా గౌరవంగా నిలబడేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ట్రస్టులో ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, నర్సింగ్, మోటర్ రివైండింగ్, ప్లంబింగ్, ఎయిర్ కండిషనర్ వంటి కోర్సులు ఉన్నాయని వివరించారు. ఈ శిక్షణ ద్వారా యువత ఉద్యోగాల కోసం ఇతరులపై ఆధారపడకుండా, స్వయం ఉపాధితో ఆత్మవిశ్వాసంతో జీవించవచ్చని సూచించారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్

పెనమలూరు: వణుకూరు–పెనమలూరు జిల్లా పరిషత్ రోడ్డుకు ఎమ్మెల్యే బోడెప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. నాబార్డు నిధులు రూ.1.80 కోట్లతో దాదాపు 3.5 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం చేయనున్నారు. రోడ్డు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డీఈ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మారుపూడి ధన కోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, సంగెపు రంగారావు, కొమ్మినేని శ్రీనివాసరావు, సుంకర రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి



కోనేరుసెంటర్: కృష్ణాజిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని కృష్ణాజిల్లా నూతన ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఎంతో ఘన చరిత్ర కలిగిన కృష్ణాజిల్లాకు ఎస్పీగా రావటం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడతానన్నారు. మీడియా కూడా బాధ్యతగా వ్యవహరించాలని, రాజకీయ నాయకులు, అధికారుల మీద ఇష్టానుసారంగా వార్తలు ప్రసారం చేయటం, ప్రచురించటం వంటి చర్యలకు పాల్పడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తొలుత నూతన ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు జిల్లా పోలీసు అధికారులు సకల లాంఛనాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా అడిషనల్ ఎస్పీలు వి.వి.నాయుడు, బి.సత్యనారాయణలతో పాటు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఇతర అధికారులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.